
వన భోజనాలకు బయలుదేరిన మహిళలు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

● జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య


మాట్లాడుతున్న డీఈఓ మొండయ్య

కరీంనగర్ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య అన్నారు. బుధవారం కరీంనగర్ పట్టణంలోని సప్తగిరి కాలనీ పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రారంభ సమయంలోనే పాఠశాలను వచ్చిన ఆయన ప్రార్థన, ఇతర కార్యక్రమాలను పరిశీలించారు. 8, 10 తరగతుల్లో జరుగుతున్న జీవశాస్త్రం, గణితం క్లాస్‌లను తరగతి గదిలో కూర్చుని పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ అభ్యసనా సామర్థ్యాల సాధన దిశగా విద్యాబోధన సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థులకు బోధించే ముందు బాగా ప్రిపేర్ కావాలన్నారు. కార్యక్రమంలో ప్రణాళిక సమన్వయ కర్త మిల్కూరి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖర్గే సభపై కాంగ్రెస్ నజర్



- పెద్ద ఎత్తున నేతలను తరలించేందుకు ప్రయత్నాలు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ప్రణాళిక
- గ్రామస్థాయి నేతల కోసమే సదస్సు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర పర్యటన వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల, బ్లాక్ శాఖల అధ్యక్షులను, ముఖ్య నేతలను పెద్ద ఎత్తున తరలించేందుకు సన్నద్ధమవుతున్నది. మూడు నెలల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈనెల 4న ఎల్‌బీ స్టేడియంలో ఖర్గే ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామ, మండల, బ్లాక్, జిల్లా శాఖల అధ్యక్షుల సమ్మేళనం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసి పటిష్టమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఇప్పటికే జిల్లాల్లో అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా, పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు.

● వారం రోజులకో కార్యక్రమంతో ప్రజల్లోకి..

నియోజక వర్గ స్థాయి నేతలు ఆయా గ్రామాల బాధ్యులను గుర్తించి వారికి వాహనాలను సమకూర్చి గ్రామ స్థాయి నేతల తరలింపునకు కార్యాచరణ రూపొందించారు. గ్రామ మండల బ్లాక్, జిల్లా శాఖల అధ్యక్షులకు మాత్రమే పరిమితమైన సదస్సు అయినా అనుబంధ సంఘాల నేతలను, క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నేతలను కూడా తరలించాలని నిర్ణయించారు. ఇప్పటి నుంచి ప్రతి వారం, పదిహేను రోజులకు ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి ఇప్పటికే అందిన ఫలాలను వివరించేందుకు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రచారాలను తిప్పికొట్టే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

● డీసీసీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం

డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసన సభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణతో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. డీసీసీ కార్యాలయంలో కవ్వంపల్లితోపాటు పార్లమెంట్ నియోజకవర్గ పీసీసీ సమన్వయ కర్తలు మహ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, ఆడం రాజ్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితర నేతలు సమావేశంలో పాల్గొని క్షేత్రస్థాయి నేతలకు దిశా నిర్దేశం చేశారు.

(మిగతా 8వ పేజీలో)

కురుమ సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు

కరీంనగర్ రూరల్, జూలై 2: స్థానిక బొమ్మకల్ 6వ డివిజన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరయ్య-కమరావతి, మహంకాళిమాతకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బాగోతం బీరయ్య, వార్డు మాజీ సభ్యుడు పద్మా వెంకటేశ్, దయ్యాల పోచాలు, మ్యాకల కనకయ్య, పెద్ది రాయుడు, పెద్ది శంకరయ్య, మ్యాకల బీరయ్య, రాజయ్య, రాజమల్లు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

డాక్ సేవకులకు అందని వేతనాలు
● పట్టించుకోని అధికారులు
● రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు
6
పచ్చగడ్డితో పాల దిగుబడి
● పాడి పశువులకు పచ్చి మేత మేలు
7

జీపీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మానకొండూర్‌లో అభివాదం చేస్తున్న జీపీ జేఏసీ నాయకులు

మానకొండూర్,జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కారోబారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముంజంపల్లిలో జీపీ ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో జీపీ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. 51 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా జీపీ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ జిల్లా చైర్మన్‌గా బొల్లం శ్రీనివాస్, వైస్ చైర్మన్లుగా తాల్లపల్లి అంజయ్య, నర్సింగోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పిల్ల రవి, జాయింట్ సెక్రటరీగా కె రాజనర్సయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎండీ ఫారుఖ్, కోశాధికారిగా కళాల దామోదర్‌రెడ్డి, 12 మందిని ఈసీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హుజూరాబాద్‌లో ట్రా'ఫికర్'

- రోజు రోజుకు పెరుగుతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పట్టణవాసులు
- ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్


హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా

హుజూరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతోంది. నిత్యం వేలాది వాహనాలు హుజూరాబాద్ పట్టణం మీదుగా కరీంనగర్, వరంగల్, జమ్మికుంట తదితర ప్రాంతాలకు వెళ్తుంటాయి. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు జరుగు తున్నాయి. నాలుగేళ్ల క్రితం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు పోలీస్ శాఖ సూచించింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సూచనలను పట్టించుకోలేదు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు పట్టణంలోని సూపర్‌బజార్, వరంగల్ రోడ్, డీసీఎంఎస్ కాంప్లెక్స్, జమ్మికుంట రోడ్, కరీంనగర్ రోడ్‌పై పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు అంబేద్కర్ చౌరస్తా మీదగా వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి..

- ఎస్ రాజేందర్, వాహనదారుడు, హుజూరాబాద్



హుజూరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ అధికంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనాల రద్దీతో రోడ్డు దాటాలంటే భయం వేస్తోంది. అధికారులు చొరవ తీసుకొని ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి.

చర్యలు తీసుకుంటున్నాం.

- కరుణాకర్, టౌన్ సీఐ, హుజూరాబాద్



హుజూరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, సైదాపూర్ క్రాస్‌లో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేశాం. సిగ్నల్స్ ఏర్పాటు కోసం మున్సిపల్ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. రోడ్లపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తున్నాం.

అమ్మవారికి శాకాంబరి ఉత్సవాలు


దుర్గా భవానీ ఆలయంలో అలసంద మాలలతో అమ్మవారు

కరీంనగర్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలోని శ్రీదుర్గా భవాని ఆలయంలో ఆషాడ మాసం శాకంబరీ ఉత్సవాలు నిర్వహి స్తున్నారు. ఈ సందర్భంగా బుధ వారం అమ్మవారిని అలసంద మాల లతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ పూజారులు విశేష హరతులు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహిం చారు. భక్తులు అమ్మవారిని దర్శించు కుని ఒడిబియ్యం, చీరె సారె సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.దుర్శేడ్ శ్రీవిశ్వంభరీ పీఠం ఆధ్వర్యంలో గల మరకత లింగ రాజేశ్వర స్వామి అయంలో శాకాంబరీ ఉత్సవాలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన 108 రకాల పండ్లు కూరగాయలు, పూలతో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పండ్లు, పూలు, కూరగాయలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అచర్చకులు దేవరాజు, ప్రశాంత్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, విశాల్‌శర్మ, ఆలయ చైర్మన్ నందాల తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, సాయిని తిరుపతి, గౌడ నర్సయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

చొప్పదండి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవం తం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికా లను ఆదేశించారు. బుధ వారం మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను, గ్రామ పంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి దశల వారీగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. మంజూరైన ఇళ్లు బెస్‌మెట్ లెవల్‌కు చేరాలన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గుమ్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఓపీ రికార్డులను తనిఖీ చేసి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల ఆధార్, ఫోన్ నంబర్లను సేకరించాలని, ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఎంపీడీవో వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


గుమ్లాపూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు చేయూత


బాలబాలికలతో కలెక్టర్ పమేలా సత్పతి

గణేశ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కొవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన వారికి ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ఏడుగురు బాల బాలికలకు పీఎం కేర్ ద్వారా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆర్థిక సాయం అందజేస్తోందన్నారు. ఈ పిల్లలకు 18 సంవత్సరాల వయసు నిండేసరికి 10 లక్షల రూపాయలు వారి ఖాతాలో జమవుతాయని తెలిపారు. జిల్లాలో కొవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు పిల్లల్లో నలుగురికి 18 సంవత్సరాల నిండినందున వీరితో కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు. పిల్లలు ఏం చదువుకోవాలన్నా ప్రభుత్వ సంస్థల్లో అడ్మిషన్లు ఇప్పిస్తామని సూచించారు. పిల్లలకు వారసత్వంగా వచ్చే ఆస్తులను వారికి సంక్రమించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పీఎం కేర్ ద్వారా జమ చేసిన సొమ్మును విద్యా అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాంకు పాస్‌బుక్, ఆరోగ్య కార్డులు అందజేశారు. సమావేశంలో ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్, పీవోలు తిరుపతి, శాంత, ఎల్‌సీపీవో రాజు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ


పార్టీ ప్రతినిధులతో కలిసి ఈవీఎం గోదాంను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్

కరీంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కలెక్టర్‌కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోదాంను అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్ప టికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నామన్నారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకు న్నారు. కార్యక్రమంలో డీర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో కె మహేశ్వర్, కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం బర్కత్ అలీ, టీడీపీ కళ్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

నగరంలో రాజకీయ వేడి

- బల్దియాపై ప్రధాన పార్టీల దృష్టి
- సమస్యలు, అభివృద్ధిపై అధికారులకు వినతులు
- మొన్న బీఆర్ఎస్, నిన్న కాంగ్రెస్, నేడు బీజేపీ
- కార్పొరేషన్‌ను కైవసం చేసుకునేందుకు తహతహ



కరీంనగర్ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర పాలక సంస్థపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. స్థానిక సంస్థలకు 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలపై కసరత్తు చేస్తున్నాయి. ఈనెల 11న మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు కేసు విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో బల్దియా ఎన్నికలు త్వరలోనే జరుగుతాయనే అభిప్రాయం వ్యక్తం అవు తోంది. ఇటీవల కరీంనగర్ నగర పాలక సంస్థలో విలీనమైన కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు సమీప గ్రామాలను కలిపి 66 డివిజన్లతో కూడిన వార్డుల పునర్విభజన (డీలిమిటేషన్) తుది జాబితాను ప్రభుత్వం విడుదల చేయడంతో కరీంనగర్‌లో రాజకీయ వేడి రాజుకుంటుంది.

● మారిన డివిజన్ల స్వరూపం

వార్డుల పునర్విభజన ప్రక్రియ సరిగా చేయలేదని నిబంధనలకు విరుద్ధంగా చేశారంటూ దాదాపు అన్ని రాజకీయ పార్టీలు, ఔత్సాహిక అభ్యర్థులు, ముసా యిదా జాబితాపై పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. 245 మంది ముసాయిదా జాబితాను తప్పులను ఎత్తిచూపుతూ అభ్యంతరాలతో అధికారులకు దరఖాస్తులను సమర్పిం చారు. వాటిని క్షేత్ర స్థాయిలో పునప రిశీలించిన అధికారులు డిలిమిటేషన్ ప్రక్రియన ముగించి తుది జాబి తాను విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లు ఉన్న స్వరూపం పూర్తిగా మారిపోయింది. ఒక్కో డివిజన్‌లో ఐదు వేల చొప్పున 10శాతం ఎక్కువ లేదా తక్కువ ఓట్లతో 66 డివిజన్లను ఏర్పాటు చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియ నిబంధనల మేరకు పూర్తి చేశామని అధికారులు వెల్లడించారు. మాజీ మేయర్లు యాదగిరి సునీల్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్ తుది జాబితాలో పలు లోపాలు ఉన్నాయని, ఎంఐఎంకు లబ్ధి చేకూర్చేందుకు అధికార కాంగ్రెస్ ఎంఐఎం కుమ్మక్కై, అనుకూలంగా డివిజన్లను విభజన ప్రక్రియ పూర్తి చేయించారని ఆరోపించారు.ఉంటే ముసాయిదా విడుదల చేసి అభ్యంతారాలను స్వీకరించి తుది జాబితాను విడుదల చేసినందున ఇక డివిజన్లు మారవని ఇదే

(మిగతా 8వ పేజీలో)

● మూడు పార్టీలకు సమాన పట్టు

గత ఎన్నికల్లో 60 డివిజన్లలో 33 డివిజన్లను బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. 9 మంది స్వతంత్ర అభ్యర్థులు బీఆర్ఎస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం 42కు చేరింది. బీజేపీకి చెందిన 12 మంది, ఎంఐఎంకు చెందిన ఏడుగురు కార్పొరేషన్‌లో ప్రాతినిధ్యం వహించారు. ఆ తరువాత కొంత మంది కార్పొరేటర్లు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌కు, బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పది మందికి పైగా కార్పొరేటర్లు ఆ పార్టీలో చేరారు. గత పాలకవర్గ పదవీ కాలం జనవరి 29న ముగిసింది. అప్పటి నుంచి స్తబ్దంగా ఉన్న రాజకీయ పార్టీలు ఇప్పుడు సమస్యలను అస్త్రంగా చేసుకుని బల్దియాపై జెండా ఎగురవేయాలని భావిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు వివిధ పార్టీల్లో చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అన్ని పార్టీలకు చెందిన నాయకులు, మాజీ కార్పొరేటర్లు ఆ పార్టీలో చేరుతున్నారు. మరో వైపు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో మాజీ మేయర్ సునీల్ రావుతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. ప్రస్తుతం ఈ మూడు పార్టీలకు నగర పాలక సంస్థలో సమానమైన పట్టున్నట్లుగానే కనిపిస్తోంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గంగాధర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. స్థానికుల వివరాల ప్రకారం.. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్21టీ5511) 34మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళుతూ గంగాధర బస్‌స్టాండ్ సమీపంలో విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్థంభం విరిగి, విద్యుత్ తీగలుతెగి బస్సు ముందు పడి పోయాయి. అయితే తీగలు బస్సుపై పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదని ప్రయాణికులు తెలిపారు. అప్రమత్తమైన బస్సుడ్రైవర్, స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించి కరెంటుసరఫరాను నిలిపివేయించారు. ప్రమాదంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో చోరీలు

కోల్‌సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని బీ టైపు క్వార్టర్లలో మంగళవారం అర్ధరాత్రి తరువాత చోరీలు జరిగాయి. తాళం వేసి ఉన్న ఆరు క్వార్టర్లలో చొరబడ్డ దొంగలు సామగ్రిని చిందరవందర చేశారు. నగదు, ఆభరణాలు క్వార్టర్లలో లేవని యజమానులు పేర్కొంటున్నారు. ఈ క్వార్టర్లలో ఇటీవల ఉద్యోగాల్లో చేరిన వారు ఉంటుండంతో సామగ్రి పెద్దగా లేదు. ఎన్‌టీపీసీ పోలీసులు, క్లూస్ టీమ్‌లు పరిశీలించాయి.

డాక్ సేవకులకు అందని వేతనాలు



- పట్టించుకోని అధికారులు
- రోజువారీ ఖర్చులకు ఇబ్బందులు

భగత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేవుడు వర మిచ్చినా పూజారి కనికరించని చందంగా భారతీయ తపాలా శాఖలో పనిచేస్తున్న గ్రామీణ డాక్ సేవకుల పరిస్థితి తయారైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది సంఖ్యలో స్టాఫ్‌గ్యాప్ పోస్ట్‌మెన్, గ్రామీణ డాక్ సేవకులు పనిచేస్తున్నారు. తపాల శాఖలోని పనులన్నీ చక్కబెడుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదు. గ్రామీణ్ డాక్ సేవకులకు సంబంధిం చిన సెలవు, డిప్యూటేషన్, డిశ్చార్జ్, టెర్మినేషన్ ద్వారా ఏర్పడ్డ ఖాళీల్లో పని చేస్తున్న గ్రామీణ్ డాక్ సేవకులకు వేతనాలు చెల్లించాలని జూన్ 13వతేదీన తపాలా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జిల్లాలోని తపాల శాఖ కార్యాలయాలకు నెం. పిఎంజి (హెచ్) ఈఎస్‌టి-3/ జిడిఎస్ మ్యాటర్స్ 2025ను పంపించారు. అయినా వీరికి సంబంధించిన సమస్యలను స్థానికంగా పరిష్కరించడం లేదని గ్రామీణ్ డాక్ సేవకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజు వారీ ఖర్చులు

నిత్యం సబ్ పోస్టాఫీసుల నుంచి ఉత్తరాలను బట్వాడా చేయడానికి ద్విచక్ర వాహనాల్లో వంద రూపాయలకు పైగా పెట్రోల్‌కు ఖర్చు అవుతుందని గ్రామీణ్ డాక్ సేవకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులతో పాటు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు విధులు నిర్వహిస్తున్నామంటున్నారు. జిల్లాస్థాయిలోని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తమ సమస్యలు తీసుకువెళ్లినా పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన వేతనాలతోపాటు, సమస్యలను పరిష్కరించాలని గ్రామీణ్ డాక్ సేవకులు కోరుతున్నారు.

విధుల నిర్వహణకే అప్పులు చేస్తున్నాం

యూర గిరిప్రసాద్, స్టాఫ్ గ్యాప్ పోస్ట్‌మన్, ఆరెపల్లి



రోజు వారీగా విధులు నిర్వర్తించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. నిత్యం ఉత్తరాలు బట్వాడా చేయడానికి ద్విచక్ర వాహనంలో పెట్రోల్ ఖర్చులకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. తక్కువ జీతాలు ఉన్నా సర్దుకుపోతూ పని చేస్తున్నా సమయానికి వేతనాలు ఇవ్వడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

అధికారులు చర్యలు తీసుకోవాలి

బొల్లం నిఖిల్, స్టాఫ్ గ్యాప్ పోస్ట్‌మన్, మానకొండూరు



గ్రామీణ్ డాక్ సేవకులకు వేతనాలు ఇప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదు. తపాల శాఖ జాతీయ సంస్థ అయినందున కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ తమ సమస్యకు పరిష్కారం చూపించాలి.

ఇజ్రాయెల్ నుంచి స్వస్థలానికి మృతదేహం

- జూన్ 16న గుండెపోటుతో జగిత్యాల వాసి మృతి



రవీందర్ శవపేటికపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జగిత్యాల అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయెల్‌లో గుండె పోటుతో మృతిచెందిన రేవెల్ల రవీందర్(57) అనేవ్యక్తి మృతదేహం బుధవారం స్వస్థలమైన జగిత్యాలకు చేరుకుంది. బతుకు దెరువు కోసం ఇజ్రాయెల్ వెళ్లిన రవీందర్ గుండెపోటుతో జూన్16న తన గదిలో మృతి చెందాడు. అప్పుడు ఇజ్రాయెల్‌లో యుద్ధనేపథ్యంలో రవీందర్ మృతదేహాన్ని తీసుకురావడానికి ఇబ్బందులు ఎదురవడంతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలు ఎన్నారై అడ్వైజరీకమిటీ చైర్మన్ మంద భీంరెడ్డితో మాట్లాడి జగిత్యాలకు తీసుకువచ్చేలా చర్యలు తీసుకున్నారు. రవీందర్ మృతదేహాన్ని ఎయిర్ అంబులెన్స్ ద్వారా జోర్డాన్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి బుధవారం ఉదయం హైదరాబాద్‌కు తరలించారు. దీంతో రవీందర్ బంధువులతోపాటు జగిత్యాల మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ అడువాల జ్యోతి బుధవారం ఎయిర్‌పోర్టుకు వెళ్లి మృతదేహాన్ని జగిత్యాల పట్టణానికి తీసుకువచ్చారు. రవీందర్ కుటుంబసభ్యులు శవపేటికపై పడి రోదించారు. రవీందర్ అంత్యక్రియల్లో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటు అడువాల జ్యోతి, లక్ష్మణ్ పాల్గొన్నారు. రవీందర్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ అడువాల జ్యోతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం

కోరుట్ల రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్లమండలంలోని అయిలాపూర్ గ్రామానికిచెందిన మైలారం గోపాల్(52) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. గోపాల్ మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామపంచాయతీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ విద్యుత్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కొద్దికాలం క్రితం గోపాల్‌కు గుండె నొప్పి రాగా స్టంట్ వేశారు. ఆపరేషన్‌కు చేసిన అప్పుతోపాటు ఆరోగ్య సమస్యలతో మనస్థాపం చెందిన గోపాల్ బుధవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం పనులకు వెళ్లేవారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గోపాల్ కుమారుడు నమన్‌తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్‌లో చోరీ

- రూ.26వేలు, 12తులాల వెండి మాయం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణగౌడ్

జమ్మికుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ ఉదయం 11 గంటలకు పని నిమిత్తం జమ్మికుంటకు వెళ్లాడు. తన భార్య సుజాత ఉదయం 11.50గంటలకు ఇంటికి తాళం వేసి వన భోజనాలకు వెళ్లింది. సత్యనారాయణ పనులు ముగించుకొని మధ్యాహ్నం 12.30గంటల సమయంలో ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోనికి వెళ్లి చూశాడు. ఇంట్లోని సామగ్రి చిందర వందరగా పడేసి ఉంది. అనుమానం వచ్చి బీర్వాను తీసి చూడగా అందులోని రూ.26వేల నగదు, 12తులాల వెండి పట్టి గొలుసులు చోరీకి గురైనట్లు నిర్ధారణకు వచ్చాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని తెలిపాడు. బాధితుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్‌రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఫ్యాకల్టీ కోసం డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆందోళన

- ఫైన్‌ఆర్ట్స్ కోర్సు మెటీరియల్, ఫ్యాకల్టీ లేక ఇబ్బందులు
- గంటపాటు రాస్తారోకో
- అధికారుల హామీతో విరమణ



రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులు

తంగళ్లపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఫైన్‌ఆర్ట్స్ కోర్సుల్లో మెటీరియల్, సరైన ఫ్యాకల్టీ లేదంటూ మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీకళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సిరిసిల్ల-సిద్దిపేట ప్రధాన రహదారిపై విద్యార్థినులు సుమారు గంటపాటు ఆందోళన నిర్వహించారు. సుమారు 200మంది విద్యార్థులు కళాశాల నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రధాన రహదారికి చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లడుతూ మూడునెలలుగా మెటీరియల్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఫ్యాకల్టీ లేక తమ చదువులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా గెస్ట్ ఫ్యాకల్టీలకు వేతనం రాకపోవడంతో వారు సక్రమంగా చదువులు చెప్పడం లేదన్నారు. మెటీరియల్ లేక, సరైన ఫ్యాకల్టీ లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఉపేంద్రచారి సిబ్బందితో చేరుకుని ఆందోళన విరమించాలని కోరగా విద్యార్థినులు ససేమిరా అనడంతో కళాశాల ప్రిన్సిపాల్, తహసీల్దార్‌లకు సమాచారం అందించారు. తహసీల్దార్ జయంత్‌కుమార్, ప్రిన్సిపాల్‌లు విద్యార్థులకు నచ్చచెప్పి రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తామనడంతో ఆందోళన విరమించారు.

భార్య కాపురానికి రావడం లేదని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి

ధర్మపురి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని ధర్మపురి మండలం తీగలధర్మారం గ్రామంలో అలకుంట రాజశేఖర్ (27) అనే యువకుడి పురుగుల మందుతాగగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజశేఖర్‌కు 8సంవత్సరాల క్రితం ధర్మపురికి చెందిన జ్యోతితో వివాహం అయ్యింది. జీవనోపాధి నిమిత్తం రాజశేఖర్ దుబాయ్ వెళ్లగా భార్య జ్యోతి తనపుట్టింటికి వెళ్లింది. రెండునెలల క్రితం రాజశేఖర్‌ను దుబాయ్ నుంచి ఇంటికి రమ్మని భార్య ఫోన్ చేయగా తిరిగి వచ్చాడు. నెలరోజులక్రితం జ్యోతి తనభర్త రాజశేఖర్‌తో గొడవ పెట్టుకుని ఇంటి నుండి వెళ్లి పోయింది. ఈనెల 1న సాయంత్రం భార్యతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం మామిడితోటలో పురుగుల మందుతాగాడు. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి రాజశేఖర్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి ఒక కొడుకు ఉన్నాడు. రాజశేఖర్ తల్లి ఆలకుంట శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్ కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోరుట్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని అయోధ్యపట్నం సమీపంలో గుర్తుతెలియని వాహనంఢీకొని అదేకాలనీకి చెందిన కొరిమెల లక్ష్మణ్(57) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లక్ష్మణ్ పశువైద్య కళాశాల సమీపంలో మొక్కజొన్నకాల్చి అమ్ముతూ జీవిస్తుంటాడు. మంగళవారంరాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో లక్ష్మణ్ సంఘటనస్థలంలో మృతిచెందాడు. గమనించినస్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. భార్య రాజవ్వ ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కన్నపేగు కనికరించింది

- ఊయలలో వేసిన బాబును తిరిగి ఇవ్వాలని దంపతుల వేడుకోలు
- అప్పగించిన అధికారులు

కరీంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కన్నపేగు కనికరిచింది. ఊయలలో వదిలి వెళ్లిన తమ కుమారుడిని తిరిగి ఇవ్వాలని తల్లిదండ్రులు అధికారులను వేడుకున్నారు. బుధవారం బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ)కి మొరపెట్టుకున్నారు. గతనెల 28న ఆరోగ్యపరిస్థితి బాగలేదని ఓ బాబును తల్లిదండ్రులు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని మాతాశిశు సంక్షేమకేంద్రంలోని ఊయలలో వేసి వెళ్లారు. అనంతరం సంబంధిత అధికారులు బాబును శిశు గృహానికి తరలించారు. ఇంతలోనే ఏమైందో గానీ వద్దనుకున్న తల్లిదండ్రులు మళ్లీ తమ బాబు కావాలని జిల్లా సంక్షేమసమితి ముందుకు వచ్చి ప్రాధేయపడ్డారు. వారిఅభ్యర్థనను పరిశీలించిన సీడబ్ల్యూసీ వారే తల్లిదండ్రులని నిర్ధారణకు వచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి, జిల్లాపరిషత్ కార్యాలయంలోని బాలరక్ష భవన్‌లో బాబును అప్పగించారు. తమ బిడ్డను క్షేమంగా తమకు అప్పగించినందుకు జిల్లాయంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రింగ్ కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ ఐదవ డివిజన్ పరిధి మల్కాపూర్‌లో బుధవారం శ్రీరాముల రవి(44) అనేసెంట్రింగ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లోఎవరూలేని సమయంలో సీలింగ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేని కారణంగానే రవి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- బంగారు నగలు, వెండి స్వాధీనం ముగ్గురు అరెస్టు, ఒకరు పరారీ



దొంగల ముఠా అరెస్టును చూపుతున్న పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ

పెద్దపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో దొంగతనాలకు పాల్పడ్డ అంతర్రాష్ట్ర ముగ్గురు దొంగలను అరెస్టు చేశామని, ఒకరు పరారీలో ఉన్నారని పెద్దపల్లి ఏసిపి గజ్జి కృష్ణ వెల్లడించారు. వారి నుంచి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి పట్టణం భూమ్‌నగర్‌లోని వెంకటేశ్వర రెసిడెన్సీలో నివాసం ఉంటున్న కొట్టె శ్రీవిద్య మే 25న పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అదేనెల 27న వారి ఇంటితాళం పగులగొట్టి ఉండటంతో సమాచారం మేరకు వచ్చి చూడగా, ఇంట్లో దాచుకున్న 58గ్రాముల బంగారు ఆభరణాలు, 1260గ్రాములు వెండి, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.

అదే అపార్ట్మెంట్‌లో నివాసం ఉంటున్న గుండు అనూష ఇంటితాళం పగులగొట్టి 8గ్రాములు బంగారం, 300గ్రాములు వెండి ఆభరణాలు, 10 వేల నగదు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. ఈ చోరీ లకు పాల్పడ్డ హైదరాబాద్‌లోని మల్కాజిగిరి మేడ్చల్లోని హనుమాన్ నగర్‌కు చెందిన సద్దాం అలీ, బాలాజీ నగర్‌కు చెందిన అన్వార్ అలీ, మంచిర్యాల జాఫర్ నగర్ కి చెందిన మహమ్మద్ సలాంలను అరెస్ట్ చేశామని, సలీం అనేవ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అరెస్ట్ అయిన నిందితుల నుంచి 23.28గ్రాముల డైమండ్ నక్లేస్, 14.80 గ్రాముల నల్ల పూసల దండ, 11.30గ్రాములు బంగారు ఉంగరాలు, చెవి కమ్మలు, స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 600గ్రాములు వెండిపళ్లెం, 250గ్రాములు అష్టలక్ష్మి చెంబు, 35గ్రాములు గ్లాస్‌లు, 5గ్రాముల రెండు చెంచాలు, 60గ్రాముల మాణిక్యాలు, 50గ్రాముల పంచె పాల, 62 గ్రాముల గిన్నెలు,207 గ్రాముల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు లక్ష్మణరావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు

తిమ్మాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్ శివారులో బుధవారం మానకొండూర్ మండలం లింగాపూర్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుకట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి యాజమానులు, డ్రైవర్లు అయిన ఉప్పుల సంపత్, వరికొప్పుల అంజనేయులు, కందుకూరి శ్రీనివాస్, మోదుంపల్లి హరీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

యువకుడి అదృశ్యం



అనిల్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన మర్రి బోయిన అనిల్ అనే యువకుడు జూన్ 25 నుంచి అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు త్రీటౌన్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశాను. జూన్25న రాత్రి ఎనిమిది గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనిల్ తిరిగిరాలేదు. అతనికోసం గాలించిన కుటుంబసభ్యులు ఫలితం లేకపోవడంతో పోలీసు లకు ఫిర్యాదు చేశారు. అనిల్ సమాచారం తెలిసిన వారు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లోగాని, 7330684590, 9849926649 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



రాజ్‌కుమార్, గణేష్(ఫైల్)

కొడిమ్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నల్లగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనం చెట్టును ఢీ కొనడంతో ఇద్దరు యువకులు జడ గణేష్(21), దయ్యాల రాజ్‌కుమార్(22)అక్కడికక్కడే మృతి చెందారు. మల్యాల మండలకేంద్రానికి చెందిన ఇద్దరు మిత్రులు గణేష్, రాజ్‌కుమార్ మొహర్రం వేడుకల్లో ఉపయోగించే పులిమాస్కుల కోసం నల్లగొండకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై వచ్చారు. అనంతరం నల్లగొండనుంచి వేముల వాడవైపు వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్నచెట్టును ఢీకొట్టింది. దీంతోఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడు గణేష్ తల్లి జడలత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

నిత్యం ఆధ్యాత్మిక శోభ




మద్దుట్ల గ్రామంలోని హనుమాన్ ఆలయం

- గంటకోసారి మైకుల్లో భగవద్గీత
- మద్దుట్లలో భక్తిభావం

మల్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లలో ప్రతీ రోజు తెల్లవారుజామున భగవద్గీత శ్లోకాలతో గ్రామస్థులు నిద్రలేస్తారు. కోడి కూతకు ముందే భక్తి గీతాలు గ్రామస్థుల్లో ఆధ్యాత్మిక భావాన్ని నింపుతున్నాయి. రాత్రి కూడా భగవద్గీత విని నిద్రలోకి జారుకోవడం మద్దుట్ల గ్రామంలో దైనందిన కార్యక్రమంగా కొనసాగుతోంది. దీంతో గ్రామస్థులు భక్తిభావంతో తన్మయత్వం పొందుతున్నారు. మే నెలలో గ్రామస్థులు తలా కొంత సొమ్ము పోగు చేసి రూ.1.50లక్షలతో స్థానిక హనుమాన్ ఆలయంలో మైక్ సెట్ పరికరాలు అమర్చారు. గ్రామంలో మూడు ప్రధాన కూడళ్ల వద్ద మైకులు ఏర్పాటు చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు గంటకోసారి ఊరంతా భక్తి గీతాలు మైమరిపిస్తున్నాయి.

గంటకోసారి సమయం, భక్తిగీతాలు



మద్దుట్లలో ఏర్పాటు చేసిన మైక్ సెట్‌లో ప్రతీ రోజు ఉదయం ఐదు గంటలకు సమయం, వారం పేర్కొంటూ ఆ రోజు ప్రాశస్త్యం తెలిపే భక్తి గీతాలు వస్తుంటాయి. ఉదాహరణకు సోమవారం అయితే శివుడికి సంబంధించిన భక్తి గీతాలు వస్తుంటాయి. దీంతో గ్రామస్థులు భక్తిభావంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తి గీతాలతో మేల్కొంటున్నాం: లావణ్య, మద్దుట్ల గ్రామం



మైక్‌ల ద్వారా భక్తి గీతాలు రాగానే ఊరంతా మేల్కొంటుంది. నేను కూడా మైకులో భగవద్గీత శ్లోకాలు మొదలవగానే మేల్కొని పనులు ప్రారంభిస్తున్నాం. గంటకోసారి భక్తి గీతాలు రావడంతో గ్రామంలోని ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మిక భావం నెలకొం టోంది. భక్తి గీతాలతో పాటు సమయం సులువుగా తెలుస్తోంది. గ్రామస్థులమంతా మైకుల ద్వారా భగవద్గీత గురించి పూర్తిగా తెలుసుకుంటున్నాం.



గ్రామంలో ఏర్పాటు చేసిన మైకులు

గంజాయి రవాణా చేస్తున్న నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ పోలీసులు తీగలగుట్టపల్లిలోని రైల్వేగేట్‌సమీపంలో బుధవారం గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్టు చూపించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్ ఎస్సై పి లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి తీగలగుట్టపల్లి లోని రైల్వేగేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఒక బైక్ పై కరీంనగర్ నుంచి వస్తూ పోలీస్ వారిని చూసి పారిపోబోయారు. పోలీసులు స్పందించి వారిని పట్టుకున్నారు. వారివద్ద మూడు కవర్లలో అరకిలో గంజాయి ఉంది. బుట్టిరాజారాం కాలనీకి చెందిన బందెల మణిదీక్షిత్, కిసాన్‌నగర్‌కుచెందిన జపతి సిద్దార్థతో పాటు మరో బాలుడు కలిసిగంజాయి తరలిస్తున్నారని తేలడంతో వారిని అరెస్టు చేశారు. నిందితుడు మణిదీక్షిత్ గతంలో ఆంధ్రప్రదేశ్ సీలేరు నుంచి గంజాయి రవాణా చేసి పోలీసులకు చిక్కి జైలు శిక్ష అనుభవించాడని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



పట్టు వస్త్రాల కొనుగోలులో జాగ్రత్త



● ఆషాఢంలో పట్టు చీరలకు భారీగా ఆఫర్లు
● మార్కెట్లోకి నకిలీ పట్టువస్త్రాలు రాక

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఆషాఢం.. అనగానే ఆఫర్లు ఇచ్చే కాలం అని గుర్తుకొస్తుంది.. అందులోనూ వస్త్రాల విక్రయాలపైనే వ్యాపారులు ఎక్కువగా దృష్టి సారిస్తారు. చీరలపైన బంపర్ ఆఫర్లు అంటూ అదరగొట్టేస్తారు. మహిళల హుందాతనానికి ఎన్ని ఫ్యాషన్లు వచ్చినా చీరలకు ఉన్న ప్రత్యేకత దేనిలోనూ ఉండదు. మగువలు చీర కడితే.. అందానికే అందం వస్తుంది. అలాంటి అందాన్నిచ్చే చీరల్లో పట్టుచీరలకు మరో ప్రత్యేకత ఉంటుంది. ఆషాఢం మాసం తర్వాత వచ్చేది శ్రావణం... పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల జోరు ఉంటుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలు ఆషాఢంలో ఇచ్చే ఆఫర్లతో పట్టు చీరలను కొనుగోలు చేస్తారు. శుభకార్యాల్లో ప్రత్యేకంగా కనిపించడానికి పలు డిజైన్ల చీరలతో పాటు పట్టు చీరలను కొనుగోలు చేస్తారు. ఇందుకు అనుగుణంగా మార్కెట్లో కూడా పట్టు చీరలు అమ్మకాల కోసం వ్యాపారులు పలు రకాల చీరలు తీసుకొచ్చారు. పట్టుచీరల తయారీకి ఎక్కువ సమయం పడుతుంది. అందుకే ఖరీదు కూడా ఎక్కువగానే ఉంటాయి.

మార్కెట్లో అసలైన పట్టు వస్త్రాల ఖరీదు ఎక్కువగానే ఉంటుంది. రూ.3 వేల నుంచి రూ.లక్షకు పైగా ధరలు ఉన్నాయి. మార్కెట్లో అసలైన పట్టు వస్త్రాల ఖరీదు కనీసం రూ.5వేల పైనే మొదలవుతుంది. ధర్మవరం, హిందూపురం, పోచంపల్లి, ఉప్పాడ, మహారాష్ట్ర, పైతాని వీటితో పాటు ఇంకా రకరకాల చీరలు మార్కెట్లో ఉన్నాయి. మల్బరీలో రీల్ మల్బరీ, డుపీయాన్, స్పిన్, నాయి, మట్కా, త్రోస్టర్ తదితర రకాలతో పాటు టస్సర్‌లో రీల్డ్ టస్సర్, రీచా, కటియ, జరీ వంటివి కూడా పట్టులో వాడిన దారాలను రంగులు కలిపి వస్త్రాలను తయారుచేస్తారు.

జాగ్రత్తగా పరిశీలించాలి..

పట్టు వస్త్రాల తయారీలో కొంత మెరుపులు ఉన్నా వాటిని జాగ్రత్తగా పరిశీలించాలి. మల్బరీ సిల్క్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. మార్కెట్లో అసలైన పట్టును గుర్తించాలంటే యానిమల్ ఫైబర్ జుట్టు ఊలు మాదిరిగా ఉంటుంది. దీని దారం పోగులను చివరి భాగంలో కత్తిరించి కాల్చినప్పుడు జుట్టు కాలిన వాసన వస్తుంది. పట్టు అయితే కాలకుండా వెంటనే ఆగిపోతుంది. అలాగే గుండ్రంగా పూసలా మారుతుంది. పట్టు వస్త్రాలకు నీళ్లను ఎక్కువగా పీల్చుకునే, వదిలించుకునే గుణాలు కలిగి ఉంటాయి. దీనివల్ల నీళ్లలో ఎక్కువ సమయం ఉంచితే రంగుపోతుంది. పట్టు వస్త్రాలను ఉతికి శుభ్రం చేసే సమయంలో గోరు వెచ్చని మంచినీటిని ఉపయోగించాలి. నీళ్లలో బేబీషాంపు లాంటివి ఉపయోగించవచ్చు. పట్టువస్త్రాలను ఎక్కువ కాలం ఒకేలాగ మడతలు ఉంచవద్దు. మార్దవం మంచిది.

ఘనంగా వారాహీ గుప్త నవరాత్రి ఉత్సవాలు



అమ్మ వారికి పూజలు చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వారాహీ గుప్త నవరాత్రి ఉత్సవాలు సుల్తానాబాద్ లో ఘనంగా జరుగుతున్నాయి. ఆషాఢమాసం ఆరంభంతోనే వారాహీ అమ్మ వారి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలోని సాంబశివ దేవాలయంలో రోజు రాత్రి పూజలు వైభవంగా జరుగుతున్నాయి. రోజుకు ఒక్క తీరుగా వివిధ నైవేద్యాలను అమ్మ వారికి సమర్పిస్తున్నారు. రోజు కుంకుమ అర్చనలు వారాహీ అష్టోత్తరాలు సామూహికంగా పారాయణం చేస్తున్నారు. బుధవారం రాత్రి ఏడవ రోజు పూజలలో భాగంగా అమ్మవారికి లఘు వారాహీ దేవి అవతారంగా భావిస్తూ పలు పూజలు చేశారు. అమ్మ వారికి కొబ్బరి తురుము, శర్కర, బెల్లపు అన్నం, వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ నైవేద్యంగా సమర్పించారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 6,713 క్యూసెక్కుల నీరు రాక



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం కొద్దికొద్దిగా వరద పెరుగుతోంది. డ్యామ్‌లోకి 6,713 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.405 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 10.835 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 635 క్యూసెక్కుల నీటి ని వదిలారు. ఇదిలా ఉండగా జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 5.327 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 1.710 టీఎంసీల నీటిని వ్యయం చేశారు.

జాతీయ రైఫిల్ పోటీలకు సాగర్ ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జాతీ య స్థాయి రైఫిల్ పోటీలకు జిల్లాకు చెందిన సి. సాగర్ ఎంపికయ్యారు. గత నెల హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 25 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ కనబరిచాడు. సాగర్ కరీంనగర్‌కు చెందిన సీనియర్ షూటర్ సర్దార్ అమన్‌జీత్‌సింగ్ ఆధ్వర్యంలో ఏడాది పాటు శిక్షణ తీసుకున్నాడు. ఈ సందర్భంగా సాగర్‌ను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్, షూటింగ్ సంఘాల సభ్యులు అభినందించారు.

మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు



చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం బోయినపల్లిలో జరిగిన రైతు భరోసా సంబరాల కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ కుమార్ ముంపు గ్రామాలకు చేసిందేమీ లేదన్నారు. నిర్వాసితుల పెండింగ్ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, ఒక్కో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అంతేకాకుండా నిర్వాసిత యువతకు ఉపాధి చూపించేందుకు ముంపు గ్రామాల్లో కుటీర పరిశ్రమలు సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ముంపు గ్రామాల ఐక్య వేదిక కన్వీనర్ కుస రవీందర్, నాగుల వంశీ తదితరులు ఉన్నారు.

ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులకు ఇంటర్వ్యూలు

పెద్దపల్లిటౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 7న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న 3 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, 1 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (ఎంబీబీఎస్) పోస్టులను కాం ట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వైద్యులు బయోడేటాతోపాటు ఒరిజినల్, జిరాక్స్‌ప్రతితో హాజరు కావాలని, జన రల్ సర్జరీ గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్ నిపుణులకు మొదట ప్రాధాన్యం ఉంటుందని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు రూ. లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు రూ. 53 వేల 3 వందల 51ల వేతనం ఉంటుందని, వివరాలకు కార్యాలయంలోసంప్రదించాలని పేర్కొన్నారు.

పీఈటీ పోస్టులకు రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం ఎంపిక

గణేశ్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని కేజీబీవీల్లో పీఈటీ పోస్టుల భర్తీకి (కాంట్రాక్టు పద్ధతిన) 2023లో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులను రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 1:3 రేషియో ప్రకారం ఫోన్ కాల్ లేదా మెస్సేజ్ ద్వారా పిలవనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హాజరుకావాలని తెలిపారు.

సంగీత కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మంథని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కర్ణాటక గాత్రం, కూచిపూడి, పేరణి నృత్యం, మృదంగం, వీణా, వయోలిన్ కోర్సుల్లో ప్రవేశానికి ఆసక్తి కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ కోర్సుల్లో చేరటానికి 10 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందన్నారు. వివరాలకు 08729-279927లో సంప్రదించాలన్నారు.

ఇంకుడు గుంతలతో నీటి సమస్యకు చెక్



● ఏర్పాటుకు ఆసక్తి చూపని ప్రజలు ● వృథాగా పోతున్న వర్షపు నీరు

జమ్మికుంట రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ప్రతి ఏడాది వేసవిలో నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ క్రమంలో నీటిని కొనుగోలు చేసే పరిస్థితులు వస్తున్నాయి. వర్షకాలంలో నీటిని ఒడిసి పడితే భూగర్భ జలాలు పెంచుకునే అవకాశం ఉన్నా ప్రజలు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని భూమిలోకి పోయేలా చేస్తే నీటి సమస్య ఉండదు. భూగర్భ జలాలు పెరగడంతో పాటు బోర్లు, బావులు నీటితో కలకలలాడుతాయి. ప్రజలు చుక్క నీరు భూమిలో ఇంకకుండా ఇళ్ల పరిసరాలను కాంక్రీట్‌తో మూసి వేస్తున్నారు. ఫలితంగా వర్షపు నీరు నిలవడం లేదు. వేసవిలో బోర్లు, బావులు ఎండిపోయి నీటికి కటకట ఏర్పడుతోంది.

అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి

ప్రభుత్వం ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భ జల సంరక్షణ ఏ విధంగా సాధ్యమవుతుందో ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. గుంతలు ఏర్పాటు చేసుకోనే విధాన్నిని ప్రజలకు వివరించాలి. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటనే ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తామని కచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలి. ప్రస్తూతం వర్షకాలం రావడంతో ఇప్పటికే ఉన్న ఇంకు డు గుంతలు శుభ్రం చేసి వాన నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలి.

నిబంధనలు బేఖాతరు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్తగా నిర్మించే ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ మంది ఇంటి యాజమానులు నిబంధనలు పాటించకుండా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. మరికొందరు లేని ఇంకుడు గుంతలను ఉన్నట్లుగా చూపి ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఇంకుడు గుంత నిర్మాణం ఇలా...

ఇంకుడు గుంత 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతు ఉండాలి. అడుగు భాగంలో పీటున్నర మందం రాళ్లు, దానిపై పీటున్నర 40ఎంఎం కంకర, వాటిపైన 3 పీట్ల రింగ్ అమర్చాలి. దీనిపై మూత ఏర్పాటు చేసి ఐదు మీటర్ల పైపును బిగించాలి. ఇరుపక్కల 20 ఎంఎం కంకర నింపాలి. వర్షం కురిసినప్పుడు, ఇతర సమయాల్లో వృథాగా పోయే నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించాలి.



ఫిజికల్ డైరెక్టర్ రవీందర్‌కు డాక్టరేట్



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 2(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఖోఖో క్రీడాకారుడు ఫిజికల్ డైరెక్టర్ అనంతుల రవీందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహి స్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఫిజికల్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఎలైట్ ఖోఖో ప్లేయర్స్ ఆఫ్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన చేసినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదా నం చేసింది. ప్రొఫెసర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టరేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌ను ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదిర్శ మహేందర్ రావు, ఖోఖో సంఘం సభ్యులు అభినందించారు.

లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

భగత్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా భవన నిర్మాణ కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కమిషనర్‌కు కార్మికులు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష పూరితంగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు జూలై 9న దేశ వ్యాప్త సమ్మెలో జిల్లాలోని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజ యవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజే శం,కదిరె రమేష్, నర్సయ్య, రమేష్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థికి అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థి నవనీత్

మెట్‌పల్లి రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి నవనీత్ బుధవారం అస్వస్థతకు గురయ్యాడు. విద్యార్థి కాలుకు దురద రావడంతో గమనించిన ప్రిన్సిపాల్ వెంటనే కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బుధవారం రాత్రి భోజనం చేసినంతరం కాలుకు దురుదగా ఉందని ఎనిమిదో తరగతి విద్యార్థి నవనీత్ ఉపాధ్యాయులకు తెలిపాడు. వారు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించి కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. రిపోర్టుల్లో ఎలాంటి సమస్య లేదని వచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా వైద్యుల పర్యవేక్షణ కోసం ఆసుపత్రిలో ఉంచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు





ఆర్నకొండ నుంచి రాగంపేట, రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి వెళ్లే రోడ్డు

చొప్పదండి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా రోడ్లకు ఎలాంటి మరమతులు చేపట్టలేదు. రుక్మాపూర్ నుంచి కరీంనగర్ మండలం ఫకీరుపేట రోడ్డు బురదమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్నకొండ నుంచి మల్యాల వరకు రోడ్డు మరమ్మతుల కోసం రెండేళ్ల క్రితమే నిధులు మంజూరయ్యాయి. రోడ్డును మూడు బిట్లుగా విభజించి కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు.

ఆర్నకొండ నుంచి గోపాలరావుపేట, బూరుగుపల్లి వరకు అక్కడి నుంచి మల్యాల వరకు రోడ్డును మూడు బిట్లుగా విభజించారు. పనులు మొదలయ్యే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి ఇప్పటి వరకు కనీసం మరమతులు చేపట్టకపోవడం గమనార్హం. వానలకు రోడ్డు బాగా దెబ్బ తినగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్నకొండ నుంచి రాగంపేట, రేవెల్లి, గోపాల్‌రావుపేట వరకు రోడ్డుకు మరమతులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి రోడ్డు నిర్మించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మరమతులు చేపట్టలేదు. చాకుంట నుంచి వెదురుగట్టు రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పచ్చగడ్డితో పాల దిగుబడి



పాడి పశువులకు పచ్చి మేత మేలు

గంగాధర, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పచ్చ గడ్డి పాడి పశువులకు ఎంతో మేలు చేస్తుంది. పాడి పశువులున్న రైతులు పశుపోషణపై ప్రత్యేక పద్ధతులు పాటిస్తే పాల దిగుబడి పెంచుకోవచ్చని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. గంగా ధర మండలంలో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా 33 గ్రామ పంచాయతీల్లో పాల కోసం గేదెలను పెంచుకుంటున్నారు. మండల వ్యాప్తంగా సుమారుగా ఏడు వేల లీటర్ల పాల ఉత్పత్తి సాధిస్తున్నారు. మండల వ్యాప్తంగా సాగునీటి వసతి పెరగడంతో రైతులు ఎక్కువగా పొలం సాగు చేస్తున్నారు. దీంతో పశువులకు పచ్చి గడ్డి మేతకు కొంత ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది.

పశువులున్న రైతులు 10 గుంటల్లో ప్రత్యేకంగా గడ్డిని పెంచుతున్నారు. పచ్చి మేతలో పోషక విలువలు, విటమిన్లు ఎక్కువగా ఉండటం వల్ల పశువులు ఎదకు రావడానికి, ఇటు పాల ఉత్పత్తి పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. పచ్చి మేతలో గడ్డిజాతీ, కాయజాతిలో చిరు ధాన్యాల రకాలున్నాయి. వీటిలో మేలు రకాలు పలు మార్లు కోతకు వచ్చే వాటిని ఎంచుకుని విత్తు కోవాల ని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

పశువులకు ఉపయోగకరం..

సందీప్‌రెడ్డి, పశువైద్యాధికారి గంగాధర



రైతులు పశువుల ఆరోగ్యం, పాల దిగుబడి కోసం తప్పని సరిగా గడ్డి జాతి మొక్కలను పెంచుకోవాలి. రైతులు తమకున్న పదోవంతు భూమిలో పశుగ్రాసం సాగు చేసుకుంటే పశువులకు ఎంతో ఉపయోగం. పచ్చగడ్డిని తినడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు పాలదిగుబడి పెరిగి లాభాలు పొందవచ్చు.

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గడ్డి విత్తనాలు

నేషనల్ లైవ్ స్టాక్ పథకంలో భాగంగా హైబ్రీడ్ సొర్గం మల్టీకట్ (సీఎస్‌హెచ్24ఎంఎఫ్) రకాన్ని కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తోంది. ఎకరాకు 20 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. వానా కాలం ముందు విత్తుకోవాల్సి ఉంటుంది.

విత్తనం ఇరవై రోజులకు మొలకెత్తుతుంది. ఐదు వందల క్వింటాళ్ల వరకు పచ్చగడ్డి ఉత్పత్తి వస్తుంది. ఒక్కసారి విత్తు కుంటే మూడు సార్లు కోతకు వస్తుంది. మొదటిసారి 60 రోజులకు, అనంతరం 40 రోజులకు ఒకసారి కోతకు వస్తుంది. గడ్డి ఆవులు, మేకలు, గొర్రెలు, గేదె లు తినడానికి చాలా మంచిది. ఇది అధిక ప్రొటీన్ కలిగిన పచ్చగడ్డి. విత్తనానికి ఖర్చు తక్కువ. అధిక పచ్చ గడ్డి ఉత్పత్తి కావడంతో దీనితో పశువులకు ఆరోగ్యంతో పాటు అధిక పాల దిగుబడి వస్తుంది.

వన మహోత్సవానికి సర్వం సిద్ధం

● లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం



వెంకట్రావ్‌పల్లెలోని నర్సరీలో మొక్కలు

కరీంనగర్ రూరల్/ హుజూరాబాద్‌రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్ రూరల్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవంలో భాగంగా లక్ష మొక్కలను నాటేందుకు లక్ష్యం పెట్టుకు న్నారు. ఆయా గ్రామా ల్లోని నర్సరీల్లో లక్షా 48 వేల మొక్కలు పెంచు తున్నారు. ప్రస్తుతం మొత్తం 2.23 లక్షల మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచారు. నర్సరీల్లో జామ, నిమ్మ, బొప్పాయి కరివేపాకు, మునగ తదితర పండ్ల మొక్కలతోపాటు గులాబీ, మందార, గన్నేరు తదితర పూల మొక్కలను పెంచుతున్నారు. ఆయా గ్రామాల్లో మొదటి విడతగా 50వేల మొక్కలు నాటేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్విస్తున్నారు. పనులను ముమ్మరం చేసేందుకు ఉపాధిహామీ సిబ్బందితోపాటు మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో సంజీవరావు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

● హుజూరాబాద్‌లో ఈనెల ఒకటో తేదీన శంకరపట్నం, హుజూరాబాద్, సైదాపూర్ మండలాల్లోని గ్రామపంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బందితో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ సమావేశం నిర్వహించి వనమహోత్సవం నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామపంచాయతీల్లో మొక్కలు పెంచేందుకు 19నర్సరీలతోపాటు అటవీశాఖకు సంబంధించిన నర్సరీ ఉంది. ఒక్కో నర్సరీలో సుమారు 8వేలకు పైగా మొక్కలను పెంచు తుండగా మండలంలో మొత్తం 2లక్షల 5వేల మొక్కలను గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీలలో పెంచారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

- సంజీవరావు, ఎంపీడీవో, కరీంనగర్ రూరల్

గ్రామాల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కొన్ని గ్రామాల్లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నాం. లక్ష్యం మేరకు గుంతలు తవ్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

ప్రతీ గ్రామానికి పంపిణీ చేస్తాం

- సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్

ప్రతీ గ్రామంలో మొక్కల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై మొదటి వారంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతాం. ఇచ్చిన లక్ష్యం మేరకు మొక్కలు నాటిస్తాం.

పార్టీ కోసం ఐక్యంగా ముందుకు సాగుదాం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాదామని, విభేదాలు పక్కనబెట్టి ఐక్యంగా పనిచేద్దామని ఆ పార్టీ నేత అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ బహిరంగ సభ సందర్భంగా బుధవారం నగరంలోని హోటల్ వీ పార్క్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ముగ్గురు మంత్రులు ఎంతో అవసరమని, ఒక సోదరుడిగా మీతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. రేపటి కాంగ్రెస్ బహిరంగ సభకు తరలి వెళ్లే వారికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయడంకా మోగించడానికి బహిరంగ సభ నాంది పలకబోతోందన్నారు. నాయకులు వైద్యుల అంజన్ కుమార్, అరుణ్, శ్రావణ్‌నాయక్, మాజీ కార్పొరేటర్లు బుచ్చిరెడ్డి, సరిల్లా ప్రసాద్, భూమా గౌడ్, పిట్టల శ్రీనివాస్, యాదయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి పట్టని కాంగ్రెస్ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సునీల్‌రావు

సుభాష్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులెవరూ పట్టించుకోవడం లేదని మాజీ మేయర్ సునీల్‌రావు ఆరోపించారు. బుధవారం నగర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాటాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నగర అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. దీంతో అభివృద్ధి ఎక్కడికక్కడ ఆగి పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 870 కోట్లతో నగరంలో స్మార్ట్ సిటీ పనులు పూర్తి చేశామన్నారు. అమృత్ 1, 2 పథకం ద్వారా నగరానికి రూ.279 కోట్లతో తాగునీటి పనులు గతంలో పూర్తి చేయగా ప్రస్తుతం విలీన డివిజన్లలో కొనసాగుతు న్నాయన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వెంటనే రూ.100 కోట్ల నిధులను విడుదల చేయాలన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

డంప్ యార్డు సమస్యకు ఇండోర్ తరహా పరిష్కారం

కరీంనగర్ అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇండోర్ తరహాలో కరీంనగర్ డంప్ యార్డు సమస్య పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తానని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బుధవారం బై పాస్ రోడ్‌లోని డంప్ యార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, డంప్‌యార్డు సమస్య పరిష్కారంలో దేశంలోనే ఇండోర్‌కు పేరుందన్నారు. అక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన జిల్లావాసి పరికిపండ్ల నరహరితో మాట్లాడినట్లు, కరీంనగర్‌లో నిర్వహించనున్న సదస్సుకు ఆహ్వానించినట్లు చెప్పారు. ప్రజల ఆవేదనను సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి నిధులు ఇప్పించాలని కోరనున్నట్లు చెప్పారు. నాయకులు అంజన్‌కుమార్, సతీష్, భూమయ్య, నరసన్న, గంట శ్రీనివాస్, శ్రీనివాసరావు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు

సుభాష్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేసే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం నీటిపారుదల శాఖలో పనిచేసే శంకర్ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని, సేవలు గుర్తుండాలని అన్నారు.

● సంక్షిప్తంగా..

రామడుగు: రామడుగు మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎమ్మార్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జువ్వాజి హరీష్ బుధవారం పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నాయకులు విషప్రచారం చేస్తున్నారని మాజీజడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ ఆరోపించారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పేయిడ్ టీం సూచనలతో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌ను బదనాం చేస్తున్నారన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని నల్లగొండలో సీతారామ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం చైర్మన్‌గా బండారిపల్లి లక్ష్మణ్‌ను తిరిగి కొనసాగిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చైర్మన్ లక్షణ్‌తోపాటు, పాలక వర్గానికి బుధవారం అందజేశారు.

చొప్పదండి: సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని చొప్పదండి పట్టణంలోని శివకేశవ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతలకు పూజలు చేశారు.

- చొప్పదండిలో వన మహోత్సవాన్ని మున్సిపల్ కమిషనర్ నాగరాజు ప్రారంభించారు. గుమ్లాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద మొక్కలు నాటారు. మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఇంజనీర్ శివాని, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్‌కు చెందిన రాచపల్లి సమ్మయ్య అనారోగ్యంతో మరణించగా బుధవారం యూత్‌కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు బాధిత కుటుంబ సభ్యులకు బియ్యం అందజేశారు.

- జమ్మికుంట మండలం గండ్రపల్లిలో వర్షాలు కుర వాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు బుధవారం మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీసర్పంచ్ బల్గూరి పద్మ-సమ్మయ్య పాల్గొన్నారు.

సైదాపూర్: చదువుపై ఆసక్తి గల వారిని ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్‌లో చేర్పించాలని అధికారులు సూచించారు. బుధవారం స్త్రీశక్తి భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

- మండలంలో ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ స్మారకార్థం హోటళ్లకు సుమారు 1500 స్టీల్ గ్లాసులను స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ బోనాలు నిర్వహించారు. ఎస్సీ కాలనీ మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు.

ఖర్గే సభపై కాంగ్రెస్ నజర్

(5వ పేజీ తరువాయి)

ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ నేత వి.నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి నేతల, ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వి నరేందర్‌రెడ్డితో పాటు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్, బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, భూమాగౌడ్, శ్రవణ్‌నాయక్, పిట్టల శ్రీనివాస్, నేతికుంట యాదయ్య, వెన్నం రజితారెడ్డి, చర్ల పద్మ, సిరాజ్ హుస్సేన్ తదితర నాయకులు సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఖర్గే సభకు పెద్ద ఎత్తున క్షేత్ర స్థాయి నేతలను తరలించేందుకు సంసిద్ధత ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న అన్ని కమిటీల నేతలను ముఖ్య కార్యకర్తలను చైతన్య వంతులను చేయాలని భావిస్తున్నారు. ఎన్నికల విషయంలో రాష్ట్ర హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో గ్రామ స్థాయి నేతలు కూడా సభపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నగరంలో రాజకీయ వేడి

(5వ పేజీ తరువాయి)

హద్దులతో ఎన్నికలు జరుగుతాయని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ నేపథ్యంలో అధికార కాంగ్రెస్, బీజేపిలతో పాటు, బీఆర్ ఎస్ పార్టీ బల్దియాపై ప్రత్యేక దృష్టి సారించాయి.

● పోటాపోటీగా కార్యక్రమాలు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ముఖ్య నాయకులకు సమావేశాన్ని ఏర్పాటు చేసి నగర సమస్యలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, హామీలపై చర్చించారు. అనంతరం మాజీ కార్పొరేటర్లతో కలిసి సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంగళవారం కాంగ్రెస్ నాయకుడు వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు కమిషనర్‌ను కలిసి అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువస్తామని, పనులు చేపట్టాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. బుధవారం మాజీ మేయర్ బీజేపీ నేత వై సునీల్‌రావు, ఆపార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ పమేలా సత్పతికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను కొనసాగించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, బల్దియాలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. మూడు రోజుల్లో మూడు పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు నగర అభివృద్ధి, ప్రజా సమస్యలు, పరస్పర ఆరోపణలు చేయడంతో రాజకీయం ఒక్కసారిగా వెడెక్కింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు టౌన్ టూ, రూరల్ ఏడీఈలు లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పద్మానగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్‌నగర్, వినా యకనగర్, కుర్మవాడ, శ్రీహరినగర్, మర్కం డేయనగర్, ప్రగతినగర్, రాజీవ్‌పార్క్, ఓల్డ్ లేబర్ అడ్డా, ఆదిత్యా అపార్ట్‌మెంట్ ఏరియా, సిద్ధార్థ స్కూల్, పార మిత స్కూల్, సాయి బాబా టెంపుల్, లారెల్ స్కూల్, చింతకుంట, బావుపేట, ఆసీఫ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

హుజూరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని శశ్ర పబ్లిక్ పాఠశాల కరస్పాండెంట్ వేణుమాధవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని శశ్ర పబ్లిక్ పాఠశాలలో ఇందిర వనప్రభలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముంజాల సంగీత పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర మార్కెట్ యార్డులో చొప్పదండి నియోజకవర్గ హరితసేన అధ్యక్షుడు అఖిల్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు పాల్గొన్నారు.

జ్యోతిష్మతిలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

తిమ్మాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం ఇంటెన్సివ్, కెరీర్ ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్లు విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్, హ్యాండ్స్ ఆన్ క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులపై విద్యార్థులకు పరిశ్రమలలోని రియల్ టైం అప్లికేషన్‌లకు ఎక్స్‌పోజర్‌ను అందించామని తెలిపారు.

రైతులకు అవగాహన సదస్సు

భగత్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి):కొత్తపల్లి రైతు వేదికలో నానో టెక్నాలజీపై వ్యవసాయ శాఖ, కోరమండల్ కంపెనీ సమన్వయంతో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వానాకాలంలో సాగు చేసే వారు మొక్కజొన్న, పత్తి పంటలకు 25 శాతం నుంచి 50 శాతం వరకు ఎరువులను తగ్గించుకోవాలని, నానో యూరియా, డీఏపీని 15 రోజులు వ్యవధిలో పంటలపై వాడాలని సూచించారు. ఉద్యాన శాఖ డిప్యూటీడైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శేఖర్, సెరీ కల్చరల్ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి, కోరమండల్ కంపెనీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై చిన్నారుల నృత్య ప్రదర్శన

జమ్మికుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జమ్మి కుంటకు చెందిన జోష్నిక నాట్య కళాక్షేత్రం గురువు బాదెల స్వప్నలత ఆధ్వ ర్యంలో 26మంది కూచిపూడి నాట్యకళాకారులు తిరుమల కొండపై నాట్య ప్రదర్శన చేసి భక్తులను అలరింపచేశారు. భక్తులు వారిని అభినందించారు. కళాకారుల తల్లిదండ్రులు సైతం సంతోషం వ్యక్తం చేశారు.

ఆదర్శ రైతులను నియమించాలి

కరీంనగర్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆదర్శ రైతులను మళ్లీ నియమించాలని వారు కోరారు. బుధవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలాల ఆదర్శ రైతులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006లో ఆదర్శ రైతుల నియామయం రాష్ట్రంలో చేపట్టారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదర్శ రైతులను తొలగించిందని తెలిపారు. ఆధునిక వ్యవసాయంపై అవగాహన పొందుతూ గ్రామ రైతులందరికీ అందుబాటులో ఉండే ఆదర్శ రైతు వ్యవస్థను తొలగించిన బీఆర్ఎస్‌కు రైతంగం బుద్ధి చెప్పిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మళ్లీ ఆదర్శ రైతుల వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు.

నిర్దిష్టమైన లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలు

సుభాష్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయిలోనే నిర్దిష్టమైన లక్ష్యంతో చదవాలని, అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వం బాలికల పాఠశాలలో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, శాతవాహన లయన్స్‌క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. చదువును నమ్మితే పేదరికం పారిపోతుందని, సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. లీడ్ ఇండియా క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఎస్.మనోహరాచారి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణగోపాల్, క్లబ్ సభ్యుడు పచ్చునూరి సురేందర్ పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులకు ప్రవేశాలు

గణేశ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు కె.మారుతి ఎన్.వివేక్ పాండిచ్చేరిలోని సెంట్రల్ యూనివర్సిటీలో ప్రవేశాలు పొందారు. లైబ్రరీ సైన్స్ కోర్సులో చేరినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.భవాని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ బి.లావణ్య విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



బ్లాక్ స్పాట్‌లను పరిశీలిస్తున్న సీపీ, మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ క్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు సీపీ గౌస్ ఆలం తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి నగరంలోని బ్లాక్ స్పాట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీతోపాటు తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌ల గుర్తించామన్నారు. ఈ ప్రాంతాల్లో ప్రమాదాలకు గల కారణాలను అధ్యయనం చేస్తున్నామని, పలు ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల ఐలాండ్‌లు, యూ-టర్న్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

యజ్ఞవరాహక్షేత్రంలో మరిన్ని ఆర్జిత సేవలు

కరీంనగర్ కల్చరల్, జూలై 2: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో మరిన్ని ఆర్జిత సేవలను తొలి ఏకాదశి నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే వేదపారాయణ సేవ ప్రారంభం కాగా పుట్టిన, పెళ్లి రోజులు తదితర శుభకార్యాలకు వేద ఆశీర్వచనం, సర్వ కార్య సిద్ధికి ప్రతీ నెలా పునర్వసూ నక్షత్రం నుంచి ఆరుద్ర నక్షత్రం వరకు సుందరకాండ పారాయణం, ప్రతీ నెలా రామానుజుల జన్మ నక్షత్రం ఆర్ద్ర నుంచి నమ్మాళ్వార్ జన్మ నక్షత్రం విశాఖ వరకు తిరువాయ్ మొజి సేవాకాలం సేవలు ఉంటాయని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

శంకరపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జాతీయ కీటకజనిత వ్యాధినివారణ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాశ్రీ అన్నారు. బుధవారం మొలంగూర్, కొత్తగట్టులో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై అవ గాహన కలిగి ఉండాలన్నారు. మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఇల్లందకుంట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన పొలెపాక రాణి బదిలీపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ మేరకు మండల బీఆర్ఎస్ నాయకులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యాలయ సిబ్బంది వీడ్కోలు పలికారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం



రుణం ఇప్పించి అడ్డా చూపిస్తానని మహిళకు చెబుతున్న కమిషనర్

జమ్మికుంట రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు అండగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద, ప్రధానరహదారులపై అక్రమంగా ఏర్పాటు చేసుకున్న డబ్బాలు, తోపుడు బండ్లను మున్సిపల్ కమిషనర్ దగ్గరుండి తొలగించారు. ఈ క్రమంలో గాంధీ చౌరస్తా వద్ద కూరగాయలు విక్రయిస్తున్న ఓ మహిళ వద్ద సామగ్రి లాక్కోవడంతో రోదించింది. దీంతో కమిషనర్ ఆమెను దగ్గరకు పిలుచుకొని ఈ షాపు ఎవరిదని అడగ్గా తనది కాదని, రోజంతా ఇక్కడ ఉండి కూరగాయాలు విక్రయిస్తే సేటు రూ.250 ఇస్తారని తెలిపింది. దీతో కమిషనర్ బాధపడవద్దని, రుణం ఇప్పించి కూరగాయలు అమ్ముకునేందుకు అడ్డా చూపిస్తామని హామీ ఇవ్వడంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నిజమైన చిరు వ్యాపారులకు తాము రుణం ఇప్పించి అడ్డాలు చూపిస్తామన్నారు. వారి ముసుగులో దళారులు రోడ్లపై అక్రమంగా షాపులు ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, ఏఈలు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రాంరెడ్డి వర్ధంతి

గణేశ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జి.రాంరెడ్డి 30వ వర్ధంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల లెక్చరర్ల రాష్ట్ర నాయకుడు డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో సార్వత్రిక విశ్వవిద్యాలయ స్థాపనకు ప్రొఫెసర్ రామిరెడ్డి నాంది పలికారన్నారు.

రేపు దొడ్డి కొమురయ్య వర్ధంతి

గణేశ్‌నగర్,జూలై 2(ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య 79వ వర్ధంతిని శుక్రవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని, విజయవంతం చేయాలని పూలే బీసీ సంక్షేమ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సంఘం కార్యాలయంలో మాట్లాడారు. కొమురయ్య ఆనాటి దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడారన్నారు.

బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు



లింగాపూర్-మెట్‌పల్లి బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

శంకరపట్నం, జూలై 2 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని లింగాపూర్ నుంచి మెట్‌పల్లికి వెళ్లే దారిలో బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. మూలమలుపు ఉండడంతో బ్రిడ్జిపై ఏర్పడి గుంతలను గుర్తించడం వాహనదారులకు కష్టమవుతోంది. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదు రుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందవుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. వాహనం నిలపకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, రోడ్డుకు మరమ్మతు చేయాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

డబుల్ రోడ్డు త్వరగా నిర్మించండి

తిమ్మాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డును త్వరగా నిర్మించాలని గన్నేరువరం మండల నాయకులు బుధవారం ఎల్ఎండీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విన్నవించారు. మధ్యలోనే పనులు ఆగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత మంత్రులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం త్వరలోనే పనులు పూర్తవుతాయని చెప్పడంతో ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవీందర్‌రెడ్డి, అలువాల కోటి, మన్మోహన్ రావు, తదితరులున్నారు.

అమ్మవారికి అభిషేకం

కరీంనగర్ కల్చరల్, జూలై 2: ఉత్తర ఫల్గుణి నక్షత్రం సందర్భంగా స్థానిక యజ్ఞవరాహక్షేత్రంలో బుధవారం మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి అభిషేకం చేశారు. ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు.

వెలగని సెంట్రల్ లైటింగ్



సెంట్రల్ లైటింగ్ పని చేయకపోవడంతో రహదారిపై చీకటి

తిమ్మాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీ వద్ద చేపల కాలనీ నుంచి డైట్ కళాశాల వరకు కొన్ని రోజులుగా రాజీవ్ రహదారిపై సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. చేపలకాలనీ మూలమలుపు నుంచి సెంట్రల్ లైటింగ్ పనిచేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా ఏదైనా వాహనం ఉన్నా, కాలినడకన ఎవరైనా వెళ్తున్నా, వాహనం ఆగి ఉన్నా కనిపించని పరిస్థితి. దీంతో ఎప్పుడు ఏప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సెంట్రల్ లైటింగ్ వెలిగే విధంగా చూడాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.